# ఆభిజాత్యం

'జయంతి'

ఆమె జీవనయాత్రలో యిది యిరవై రెండో కార్తీక పౌర్ణిమ. ఇలాంటివి యిరవై ఆమెకు తెలియకుండానే గడచిపోయాయి. ఆమెకు బాగా తెలిసినవల్లా నిరుడూ, ఈయేడూను. ఈ ఒక్క సంవత్సరంలోనూ తాను ఎంతగా మారిపోయిందో తలుచుకుంటుంటే ఆమెకే ఆశ్చర్యం కలుగుతూంది. ఒక స్వచ్ఛంద జీవితానికి స్వస్తి చెప్పి, ఒక అనారోగ్యపు వాతావరణంలో తిరిగి జన్మించినట్లు ఆమె భావిస్తూంది. ఎన్నడో తాను ఊహించుకున్న రసనిర్ఝరులు కేవలం ఎండమావులుగానే వుండిపోయాయి. ఈభావాలతో సరళ మేడమీద ఒంటరిగా కూర్చుని వెర్రిగా వీధిలోకి చూస్తోంది. అరబోసిన వెన్నెల ఆమె మనస్సు నింకా కలవర పెడుతూంది.

క్రిందటి కార్తీక పౌర్ణిమకు సరళ అవివాహిత. ప్రపంచంలోని సుఖ సన్నివేశాలు మూర్తీభవించిన ఆనందదేవత. ఆ సాయంత్రం ఆమె కాలేజీలో టెన్నిస్ ఫైనల్సు ఆడుతూంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు ఆమెను మెచ్చుకుంటూ ఆట చూస్తున్నారు. యువక బంభరాలు ఆమెకు వినబడేలాగ వింత ప్రశంసలు వెదజల్లుతున్నాయి.

'అది సరళాసమీరం కాదురా, ప్రేమమారుతం' అని ఒకరు,

'వెన్నెల రేఖ కాదు-మెరపుతీగ' అని యింకొకరు,

'ఈ సామ్రాజ్యం వీరభోజ్యం' అని వేరొకరు చేస్తూన్న ప్రశంసలు సరళలో క్రొత్త ఉత్సాహాన్ని పుట్టించాయి. ఆసంతోషంలోనే ఆమె ఆటగెలిచి కప్పు అందుకుంది. ఎంతసేపటికీ తమ కారు రాకపోవడంవల్ల ఒంటరిగా కాలినడకనే బయలుదేరింది సరళ. కాని, ఇంతలోనే పెద్దగాలి ప్రారంభమయింది. వెనువెంటనే జల్లుకురిసి పెద్దవర్షంగా మారింది. ఆచుట్టుప్రక్క ఏయిళ్లూ లేవు. రోడ్డు ప్రక్క మర్రిచెట్టే ఆమెనాహ్వానించింది. ఆమెకు ఆశ్చర్యంకలిగేలాగ రామ్మూర్తి అంతకుముందే ఆచెట్టుక్రింద ఒంటరిగా నిలబడి వున్నాడు. వర్షం హోరుమని కురుస్తోంది. స్వర్ణసంధ్యాకాంతులు వర్షపుధారలలో ప్రతిబింబిస్తున్నాయి. సరళ పూర్తిగా తడిసిపోయింది. వింతవింతగా అమర్చుకొన్న కురులు పూర్తిగా చెరిగి నీళ్లు కారుతున్నాయి. మూడుపొరలమాటున దాగిన ఆమె శరీరకాంతులు ఆ సంధ్యాశోభలో మిళితమౌతున్నాయి. రామ్మూర్తి చూస్తూ అలాగే నిలబడ్డాడు. సరళ మాట్లాడకుండా తలవంచుకుంది. రామ్మూర్తి తన కోటు తీసి ఆమె శరీరంమీద వేశాడు. అర్థనగ్న శరీరానికి ఆచ్ఛాదన కల్పించుకోవలసినందువల్ల సరళ కిమ్మనలేదు. రామ్మూర్తికేదో చిరకాలవాంఛ ఈనాడు ఫలించినట్లు అయింది. సరళమాత్రం కొంచెం బాధపడుతూంది. లిప్‌స్టిక్‌తో నిండిన పెదవులు రక్తపంకిలమయినట్లు సిగ్గుపడుతున్నాయి. వానకు తడిసిన హైహీల్డుబూటు ఙార్జియా చీరకు అడ్డంపడుతూంది. వీటిని చూస్తున్న రామ్మూర్తి దృష్టి మార్చాలనుకుంది సరళ.

"ఏం రామ్మూర్తీ-అలా దీర్ఘంగా యోచిస్తున్నారు!" అంది.

"ఏదో భావనకురాని మనోవేదన" అన్నాడు రామ్మూర్తి.

"అందరూ కవులు గారు. కొంచెం విడమరచి చెప్పండి" అంది సరళ.

"ఏం చెప్పను సరళా! ఎలా చెబితే తెలుస్తుంది నీకు" అన్నాడు రామ్మూర్తి తీయని బాధతో.

"మీ మాటలు నా కర్థం కాలేదు" అంది ఆమె.

"సరళా! నీలో ఏదో పెద్ద ఆకర్షణ వుంది. కలభాన్ని లాక్కునే జ్యోతిలాగ అది నన్ను నీ

వద్దకు లాక్కుంటోంది. అదే నన్ను దినదినం వెర్రివాణ్ణిగా మారుస్తోంది" అన్నాడు రామ్మూర్తి.

"రామ్మూర్తిగారూ! మీరు ఎవరితో మాట్లాడుతున్నారో తెలుసా?"

"తెలుసు. ఒక దేవకన్యతోటి. సరళా! తెలుసుకో ప్రేమయొక్క నిజరూపాన్ని- నా హృదయపు పొరల వెనక వున్న భావాన్ని గ్రహించు. ఏదీ, నీ అంగీకారం..."

"రామ్మూర్తీ! క్షమించాలి. నన్ను మీరు పూర్తిగా అర్థం చేసుకోలేదు. నా దారి వేరు-మీ దారి వేరు."

"అవి ఏకం చేసుకోడం మన చేతుల్లో లేదూ? ఒక సామాన్యుడు ధనికురాలిని పెళ్ళి చేసుకోడం అసంభవమా?"

"సంభవం కావచ్చు-ఒక దశాబ్దం దాటేక. ఏమైతేనేం మన విషయంలో అది అసంభవమే. అదిగో వాన వెలిసింది. నేను వెడుతున్నాను" అంటూ సరళ తన దారిని తాను పోయింది.

రామ్మూర్తి సరళగారి మేడమీద ఒకగదిలో అద్దెకు వున్నాడు. అతనైతే సామాన్య కుటుంబంలో పుట్టినవాడే, కాని, అతని అలవాట్లు ఎంతటి శ్రీమంతులకీ వుండవు. అతని ఠీవి, అతని వాక్చాతుర్యం వెయ్యిమందిలో ఏవొకళ్లలోనో కనబడతాయి. అతను సరళకు ఒకక్లాసు సీనియరు. ఆమెకు యౌవనం వచ్చాక స్వేచ్ఛగా మాట్లాడిన మొదటి పురుషుడతడే. అతనిలో వున్న సుగుణాలు ఆమెకు తెలుసును: అతనంటే ఆమెకు ఆప్యాయం లేకపోలేదు. కాని, అతడు తన భర్త కాడానికి తగడు. జీవితాన్ని తనహోదాకు తగినట్లు నడపలేడు. ఈనాడు తాను డాక్టరుగారి కుమార్తె. ఎంత సొమ్మువాడినా తండ్రి ఏమీ అనడు. ఒక్కొక్కరోజు 'టాయిలెట్' చేసుకు పోతూంటే కాలేజీలో విద్యార్థులు ఒళ్లు మరచిపోతారు. ఆ ఘుమఘుమలకు తోటి విద్యార్థినులు అసూయపడతారు. సమక్షంలోనూ, పరోక్షంలోనూ ఆమెమీద పూలవానే కురుస్తుంది. ఇలాంటి జీవితాన్ని రామ్మూర్తిచేతిలో పెడితే మళ్లీ ఈ జన్మలో మిత్రుల మొహాలు చూడగలదా?

వానలో తడిసివచ్చేక రాత్రి ఆమె మనస్సు పరిపరివిధాల పోయింది. ఆమెలో రాగద్వేషాలు ప్రకోపించేయి. రామ్మూర్తి ఈనాడు తన్ని అవమానించాడు. అతనిపని శృతిమించి రాగాన పడుతూంది. ఏం తలుస్తున్నాడో. అతన్ని ఆ యింట్లోంచి పంపెయ్యడమే శ్రేయస్కరం. ఈవిషయం తప్పకుండా తండ్రితో చెప్పాలి- దుష్టుల్ని దూరంగా వుంచమన్నారు. ఇలాగ సరళ ఆలోచిస్తూ నిద్రపోయింది.

మూడురోజుల తర్వాత రామ్మూర్తి గది ఖాళీ చేస్తున్నాడు. పెరట్లో నిలబడి సరళ మేడవైపే చూస్తోంది. ఆమెలో పశ్చాత్తాపం కలిగి, 'తప్పుచేశాను' అనుకుంది. పైన ఎవరో రామ్మూర్తిని అడుగుతున్నారు - "దీనికంతకీ కారణం ఏమిటిరా?" అని. "లోకపు తీర్పు" అన్నాడు రామ్మూర్తి.

ఆ తర్వాత నెలవల్లోనే సరళ పెళ్ళి స్థిరమయింది. యథావిధిగా సరళ చూసుకుంది తాబోయే భర్తను. అన్నివిధాలా తనకిసరిపోయినట్లే కనబడ్డాడు. ధనవంతుడు-రూపవంతుడు. వివాహమయ్యాక సరళ అత్తవారింటికి వచ్చేసింది. కాని రోజుగ్రోజూ ఆమె మారిపోతూంది. వెనక ఆమెలో వున్న ఉత్సాహం దినదినం చల్లారిపోతూంది. ప్రతీ చిన్న విషయానికీ అత్తగారు సాధిస్తుంది. ఆడపడుచులు అనుక్షణం అదుపాజ్ఞలలో వుంచడానికి ప్రయత్నం చేస్తారు. ఇక భర్త - తన వ్యాపారం, క్లబ్బు - ఇంతే. తనతో దినానికొ గంటయినా సుఖంగా గడపడు. ఇలాంటి వింత శక్తులమధ్య నలుగుతూ ఆమె సరి అయిన దుస్తులేనా ధరించదు. ధరించవలసిన అవసరమే లేదు. వివాహిత స్త్రీ జీవితం ఇంత అధమంగా వుంటుందని ఆమెఎన్నడూ భావించలేదంతకుముందు

పూర్ణచంద్రుడు మబ్బుచాటునుండి అప్పుడే బయటకు వచ్చాడు. 'వైవాహిక జీవిత సుఖానికి ప్రేమగాని, ధనం ప్రధానం కాదు' అన్న రామ్మూర్తి సూత్రం అక్షరాలా నిజం అనుకుంది సరళ. ఎందుకో రామ్మూర్తి ఆమె కళ్లకు కనిపించాడు, మబ్బు ప్రక్క వెన్నెలలో-మళ్లీ ఆ మబ్బు చంద్రుణ్ణి కప్పేసింది. 'రామ్మూర్తి ఉత్తముడు, ఒక్కసారి వస్తే బాగుండును' అనుకుంది.

అతని పాదాలు పట్టుకుని ఏడిస్తే తన దుఃఖం శాంతిస్తుంది అనుకుంది సరళ. ఆమెకు తెలిసీ తెలియకుండానే ఆమె ఇంద్రియాలు, మనస్సు రామ్మూర్తికోసం 'పరితపిస్తున్నాయి. ప్రక్కయింటి ఆడుబిడ్డ పూజ ముగించి, తులసీదేవికి మంగళం పాడుతూంది. ఆమె కళ్లు అప్రయత్నంగానే వర్షించడం మొదలు పెట్టాయి. ఆక్షణంలో తనకు కలిగిన అనుభూతి ఏమిటో నిర్వచించుకునే ముందే ఆమె కొయ్యలా కుర్చీలో వ్రాలివుంది. పూర్ణచంద్రుడు వెలికివచ్చి ఆమెకు శీతలోపచారాలు చెయ్యమని తన కిరణాలని పంపాడు. ఇంతలో వామనరావు వెనకనుండి వచ్చి సరళకళ్లు మూశాడు.

"రామూ" అంది సరళ ఉలిక్కిపడి.

"రాముడు కావాలా - క్రింద పనిచేసుకుంటున్నాడు, పిలవనా" అన్నాడు భర్త.

"అక్కర్లేదు" అంది సరళ.

"అయితే సరళా, ప్రతిదినం ఇదే సమయానికి ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తుంటావు!" అన్నాడు భర్త.

"ఏమీ లేదు" అంది ఆమె.

"చెప్పు సరళా- నాకు కాక ఇంకెవరికి చెబుతావు? నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో... ఎంతగా..." అంటూ వామనరావు ఆమెబుగ్గలు నిమురుతున్నాడు.

"అంతగా ప్రేమించకండి" అంది సరళ అతని చేతిని అందుకుంటూ.

"అవేం మాటలు సరళా- ప్రేమ అగ్నిహోత్రంలా పవిత్రమైనది" అన్నాడు వామనరావు.

"ఔను. ప్రేమ అగ్నిహోత్రం లాంటిది. పంచభక్ష్య పరమాన్నాలు వండిపెట్టనూ గలదు. లేదా చితాగ్నిగా మారి భస్మం చెయ్యనూ గలదు" అంది సరళ, మనస్సు ఎక్కడో పెట్టి.

---


## స్టార్ ఆఫ్ ఇండియా

పెన్సిళ్లకై

## ది మద్రాస్ పెన్సిల్ ఫాక్టరీవారిని,

ఉత్తమ తరగతి అచ్చుపనులకు, లితోప్రింటుంగునకు

## హౌ అండ్ కంపెనీ వారిని

అన్ని రకములైన స్టేషనరీ పరికరములకు

## వి. పెరుమాళ్‌చెట్టి అండ్ సన్సు వారిని

సంప్రతించండి

## వి. పెరుమాళ్‌చెట్టి అండ్ సన్స్,

5, స్ట్రింగర్ వీధి మద్రాసు–1